రైలు ఢీకొని మహిళ మృతి

మక్తల్, ఏప్రిల్ 4: రైలు ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణ సమీపంలో గురువారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మక్తల్ మునిసిపాలిటీ పరిధిలోని గార్లపల్లి గ్రామానికి చెందిన పోలమ్మ(45) తనకు సంతానం లేదని చెల్లెలికి భర్తతో వివాహం చేసింది. కొన్నేళ్ల నుంచి ఆమె మతిస్థిమితం కోల్పోయింది. గురువారం ఇంటి నుంచి వెళ్లిన ఆమె గ్రామ శివారులో రైలు పట్టాలపై నిలబడింది. గూడ్స్ రైలు ఢీకొట్టడంతో శరీరం ముక్కలై చనిపోయింది. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వంద శాతం.. అక్షరాస్యత లక్ష్యం

- నవ భారత్ సాక్షర కార్యక్రమాన్ని చేపట్టిన కేంద్రం
- 15 ఏళ్లు పైబడిన వారికి చదువు నేర్పించడమే ధ్యేయం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు
- జోగుళాంబ గద్వాల జిల్లాలో అత్యధికంగా 2,81,114 మంది నిరక్షరాస్యులు

జిల్లాల వారీగా 15 ఏళ్లు పైబడిన నిరక్షరాస్యుల వివరాలు..

జిల్లా	మహిళలు	పురుషులు	మొత్తం
మహబూబ్‌నగర్	96,468	54,929	1,51,397
జోగులాంబ గద్వాల	1,11,273	1,69,841	2,81,114
నారాయణపేట	64,105	37,461	1,01,566
నాగర్‌కర్నూల్	1,13,752	67,598	1,81,350
వనపర్తి	97,615	61,032	1,58,647

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 4: వంద శాతం అక్షరాస్యత సాధించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరో ప్రయత్నానికి శ్రీకారం చుట్టాయి. 2021-2022 బడ్జెట్‌లో ప్రకటించిన విధానంతో పాటు, 2020 నూతన జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా వయోజన విద్యకు సంబంధించిన అంశాలను పరిగణలోకి తీసుకుంది. అందులో భాగంగా 2022-2027 ఆర్థిక సంవత్సరాలకు న్యూ ఇండియా లిటరసీ ప్రోగాం(నవ భాతర సాక్షర కార్యక్రమం) పేరుతో ఆమోదం తెలిపింది. కేంద్ర ప్రభుత్వం దీనిని ఈ ఏడాది నుంచే అమలు చేసేలా చర్యలు చేపట్టింది. ఇప్పటికే జిల్లాల వారీగా చదువుకోని 15 ఏళ్లు పైబడిన వారు ఎంత మంది ఉన్నారనేది పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమం సమయంలో వివరాలను సేకరించింది. కార్యక్రమం అమలు చేసేందుకు సంబంధిత శాఖ, విద్యాశాఖ ద్వారా సర్వే నిర్వహించింది. దాంతో పాటు బ్యాంకులలో ఆర్థిక లావాదేవీల కోసం ఖాతాలు తెరిపించారు.



బోయపల్లి పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న వయోజన విద్య ప్రాజెక్టు అధికారి ఎండీ నూమాన్(ఫైల్)

జోగులాంబ గద్వాల జిల్లాలో అత్యధికం

నిరక్షరాస్యులు జోగులాంబ గద్వాల జిల్లాలో అత్యధికంగా 2,81,114 మంది ఉన్నారు. తక్కువగా నారాయణపేట జిల్లాలో 1,01,566 మంది ఉన్నారు. మహిళా నిరక్షరాస్యులు మాత్రం నాగర్‌కర్నూల్ జిల్లాలో అత్యధికంగా 1,13,752 మంది ఉండగా.. జోగులాంబ గద్వాల జిల్లాలో 1,11,273 మంది ఉన్నారు. తక్కువగా నారాయణపేట జిల్లాలో 64,105 మంది మహిళలు ఉన్నారు.

విద్యాశాఖ సమన్వయంతో ముందుకు ..

వయోజన విద్య అమలు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో నిధులు వినియోగించాలని నిర్ణయించాయి. విద్యాశాఖ సమన్వయంతో దీనిని అమలు చేయనున్నారు. ఈ మేరకు వయోజన విద్యా శాఖ, విద్యా శాఖ అధికారులకు ఆదేశాలు రావడంతో జిల్లా స్థాయిలో కార్యాచర్యణ రూపొందిస్తున్నారు. గతంలో కలెక్టర్‌తో పాటు వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్‌కు చెక్ పవర్ ఉండగా, ప్రస్తుతం కలెక్టర్, జిల్లా విద్యాశాఖ పేరుపై ఖాతాలు తెరిచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

విద్యార్థులు, యువకులతో..

గతంలో సాక్షర భారత్ కార్యక్రమం అమలు సందర్భంగా గ్రామ స్థాయిలో ఇద్దరు సమన్వయకర్తలను నియమించారు. వారితో నిరక్షరాస్యులకు చదువు నేర్పించేవారు. అందుకు వారికి ప్రతీ నెల రూ.2,000 గౌరవ వేతనం చెల్లించేవారు. ప్రస్తుతం చదువు చెప్పే బాధ్యతను స్వచ్ఛంద సంస్థలకు, చదువు చెప్పాలనే ఆసక్తి కలిగిన విద్యార్థులు, యువకులకు అప్పగించనున్నారు. 2024-2027 వరకు ఈ విధానం ద్వారా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

అమలుకు చర్యలు చేపట్టాం



నవ భారత్ సాక్షర కార్యక్రమానికి సంబంధించి ఆదేశాలు అందాయి. ఇంతలోనే ఎన్నికల కోడ్ వచ్చింది. కార్యక్రమం నిర్వహణపై మరింత స్పష్టత రావాల్సి ఉంది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 15 ఏళ్లు నిండిన వయోజనులకు చదువు నేర్పించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఆ దిశగా ఉమ్మడి జిల్లా విద్యాశాఖ అధికారుల సమన్వయంతో ముందుకు వెళ్తున్నాం.

\- ఎండీ నూమాన్, వయోజన విద్య ప్రాజెక్టు ఉమ్మడి జిల్లా అధికారి



పాదయాత్రగా శ్రీశైలం వెళ్తున్న కర్ణాటకకు చెందిన భక్తులు



పల్లకీలో ఒడిబియ్యం తీసుకొని వెళ్తున్న భక్తులు

కర్ణాటక టు శ్రీశైలం

- మండే ఎండలో శివుడి చెంతకు భక్తుల పాదయాత్ర
- జోగులాంబ గద్వాల మీదుగా నిత్యం నడక
- ఉగాదికి భ్రమరాంబ దేవికి ఒడిబియ్యం సమర్పణ
- అనాదిగా వస్తున్న ఆచారం

అలంపూర్ చౌరస్తా/వడ్డేపల్లి/అయిజ/ఉండవెల్లి, ఏప్రిల్ 4: ఉగాదికి మూడు వారాల ముందు నుంచి కర్ణాటక, మహారాష్ట్రాలకు చెందిన భక్తులు జోగులాంబ గద్వాల మీదుగా శ్రీశైలం క్షేత్రానికి పాదయాత్రగా వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. హంపయ్య పున్నమి అని చెప్పుకునే పౌర్ణమి దాటిన తర్వాత వీరు పాదయాత్ర ప్రారంభిస్తారు. ఈ ఏడాది కూడా భక్తులు కాలినడకన శ్రీశైలం వెళ్తున్నారు. గత ఏడాది కంటే ఈ సారి భక్తుల సంఖ్య పెరిగింది. ఈ నెల తొమ్మిదిన ఉగాది నాటికి శ్రీశైలం చేరుకునేలా ముందుకు సాగుతున్నారు.

పల్లకిలో ఒడి బియ్యంతో..

భ్రమరాంబ దేవిని ఆడబిడ్డలా భావించే కర్ణాటక వాసులు ఒడి బియ్యం దట్టీలలో నింపుకుని, ప్రత్యేక పల్లకీలో మోసుకెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. ఇలా ఏటా రోడ్డు వెంట వేలాది మంది భక్తులు వెళ్తుంటారు. కొంత మంది చంటి పిల్లలను సంకలో ఎత్తుకొని వెళ్తుంటే, వృద్ధులు ఊత కర్రలు పట్టుకుని, యువకులు పల్లకిలు మోస్తూ నడుస్తున్నారు. తమ వెంట శివుడికి ప్రీతిపాత్రమైన వస్తువులు, నందికోలలు, రథాలు, త్రిశూలాలు తీసుకెళ్తున్నారు. కొందరు యువకులు కాళ్లకు కర్రలు కట్టుకుని పాదయాత్ర చేస్తున్నారు. మండే ఎండలో పాదాలు కమిలిపోతున్నా శివనామ స్మరణ చేస్తూ ముందుకు సాగుతున్నారు. వందల కిలోమీటర్ల మేర భజనలు, నృత్యాలు చేసుకుంటూ.. రోడ్డు వెంట దాతలిచ్చే ఆహారం, పండ్లు, మజ్జిగ, నిమ్మరసం స్వీకరిస్తూ, ప్రత్యేక వాహనాలలో తెచ్చుకున్న ధాన్యంతో వంటా వార్పు చేసుకుని తరలిపోతున్నారు. శ్రీశైలం చేరుకున్న తర్వాత పాతాళగంగలో పుణ్యస్నానాలు చేసి, ప్రత్యేక దర్శనాలు చేసుకుని, అమ్మవారి ఆలయంలో ఒడి బియ్యం, చీర, సారె, ముక్కు పుడక సమర్పిస్తారు. ఈ సంప్రదాయం తమ పూర్వీకుల నుంచి వచ్చిందని, దానిని కొనసాగిస్తున్నామి చెప్పారు. భక్తులు తిరిగి చేరుకునేందుకు కర్ణాటక ఆర్టీసీ బస్సులను సిద్ధం చేసింది. శ్రీశైలం నుంచి తిరిగి వచ్చాక కొత్తకుండలో పరమాన్నం వండి, బంధువులు, స్నేహితులకు ప్రసాదంగా పంచుతామని తెలిపారు.



దారి మధ్యలో సేదతీరుతున్న భక్తులు

రోజూ 40 కిలో మీటర్లు పాదయాత్ర

జోగుళాంబ గద్వాల జిల్లా శాంతినగర్ మీదుగా కర్ణాటక, రాయచూర్, గుల్బర్గా వంటి ప్రాంతాల నుంచి కాలినడకన వెళ్లుతున్న వారిని 'ఆంధ్రజ్యోతి' పలుకరించింది. పూర్వకాలంలో తమ పెద్దలు గుర్రాలపై శ్రీశైలం వెళ్లేవారని, మేము పాదయాత్రగా వెళుతున్నామని చెప్పారు. అలంపూర్‌లోని జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి సన్నిధిలో రాత్రి విశ్రాంతి తీసుకుని, అమ్మవారి అనుగ్రహం పొంది పాదయాత్ర సాగిస్తున్నామని వివరించారు. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నడచి, మధ్యాహ్న భోజనం చేస్తామని తెలిపారు. తర్వాత విశ్రాంతి తీసుకొని, సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నడక సాగిస్తామని పేర్కొన్నారు. ఇలా రోజుకు 40 కిలో మీటర్ల దూరం నడుస్తున్నామని చెప్పారు.



కాళ్లకు కర్రలు కట్టుకొని నడుస్తున్న యువకుడు



దట్టీలు కట్టుకొని వెళ్తున్న మహిళా భక్తులు



అయిజలో శివ భక్తులు ఏర్పాటు చేసిన శిబిరంలో భోజనాలు చేస్తున్న కర్ణాటక భక్తులు

అలుపు ఉండదు



కర్ణాటక ప్రాంతంలోని బీజాపూర్, గుల్బర్గా, యాదగిరి, కొల్హాపూర్, శాషాపూర్, హోస్పేట్, రాయచూరు తదితర ప్రాంతాల నుంచి భక్తులు శ్రీశైలం పాదయాత్రగా వెళ్తారు. మాకు ఎలాంటి అలసట ఉండదు. భ్రమరాంబిక, మల్లికార్జున స్వామి వార్లను మనసులో తలచుకుంటూ ముందుకు వెళ్తాం.

\- భక్తుడు శాంతప్ప శాషాపూర్

ఎండ ఏమీ చేయదు



మేము ఏటా శ్రీశైలానికి పాదయాత్రగా వెళుతున్నాం. 15 సంవత్సరాలుగా నడుచుకుంటూ వెళ్తున్నా ఎలాంటి అనారోగ్యానికి గురికాలేదు. ఎండ, చలి.. అమ్మను తలుచుకుంటే ఏమీ చేయలేవు. మనసులో దైవచింతన ఉంటే ఎంత దూరమైనా ప్రయాణం చేయవచ్చు. నిష్ఠతో ప్రతీ భక్తుడు శ్రీశైలానికి వస్తే బాగుంటుంది.

\- భక్తురాలు మల్లమ్మ, యాదగిరి

ఎన్నికలపై సీఎం దిశానిర్దేశం

- 2 లక్షల మెజారిటీ తగ్గకూడదు
- అన్నిస్థాయిల్లో సమన్వయ కమిటీలు వేసుకోవాలి
- తుక్కుగూడ సభకు ప్రతీ కార్యకర్తను తరలించాలి
- జిల్లా ఎమ్మెల్యేలు, పార్లమెంట్ అభ్యర్థి, ముఖ్య నాయకులతో సీఎం రేవంత్ సమీక్ష

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 4: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, చేపట్టాల్సిన ప్రణాళికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ నాయకులకు దిశానిర్దేశం చేశారు. పార్లమెంట్ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పని చేయాలని సూచించారు. గురువారం ఆయన హైదరాబాద్‌లో మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, ఢిల్లీలో ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి, ఈర్లపల్లిశంకర్, వాకిటి శ్రీహరి, పర్ణికారెడ్డితోపాటు పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి సంపత్‌కుమార్‌లతో సమావేశం అయ్యారు. ఎన్నికల్లో రెండు లక్షల మెజారిటీ వచ్చేలా పని చేయాలని చెప్పారు. ప్రతీ నియోజకవర్గానికి 25 వేల మెజారిటీ తగ్గకుండా చూడాలని అన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సమన్వయ కమిటీలు వేసుకుని అందరూ కలిసి కట్టుగా పని చేసి, చల్లా వంశీచంద్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలను ప్రతీ గడపకు తీసుకువెళ్లాలని వివరించారు. ఈనెల ఆరో తేదీన తుక్కుగూడలో నిర్వహించే కాంగ్రెస్ సభకు గ్రామంలోని ప్రతీ కార్యకర్తను తరలించాలని కోరారు. పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సభకు భారీగా జన సమీకరణ చేయాలని శ్రేణులకు ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.



హైదరాబాద్‌లో జిల్లా ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులతో సమావేశమైన సీఎం రేవంత్‌రెడ్డి

ఆస్తి పన్నులో ఐదు శాతం రాయితీ

- ముందస్తు చెల్లింపుదారులకు అవకాశం
- ఏప్రిల్ 30 వరకు గడువు
- ఉమ్మడి జిల్లాలో 20 మునిసిపాలిటీలు

నారాయణపేట, ఏప్రిల్ 4: ఆస్తి పన్ను 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అడ్వాన్స్‌గా చెల్లించే వారికి ప్రభుత్వం ఐదు శాతం రాయితీ కల్పించింది. ఈ నెల 30 వరకు గడువు విధించింది. ఏడాదిలో రెండు సార్లు అంటే మొదటి అర్ధ సంవత్సరం జూన్ 30 లోపు, రెండో అర్ధ సంవత్సరం డిసెంబరు 31లోపు ఆస్తి పన్ను చెల్లిస్తే ఎటువంటి వడ్డీని తీసుకోరు. పన్నులు చెల్లించడం ఆలస్యమైతే కుళాయి కనెక్షన్ కట్ చేయడం, డ్రైనేజీ సేవలను నిలిపివేయడం చేస్తారు. తెలంగాణ పురపాలక సంఘాల చట్టం 2019లోని సెక్షన్ 87 ప్రకారం పన్నుల మొత్తాన్ని రికవరీ చేయడానికి ఎగవేతదారులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. పన్నులు సకాలంలో చెల్లించి, మునిసిపాలిటీల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని మునిసిపల్ పాలక, అధికార యంత్రాంగం కోరుతోంది.

సద్వినియోగం చేసుకోవాలి



2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్ నుంచి మార్చి వరకు ప్రస్తుత ఏడాదికి సంబంధించి ఈనెల 30 వరకు పన్నులు చెల్లించే వారికి ప్రభుత్వం ఐదు శాతం రాయితీ ఇస్తోంది. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

\- యూసూఫ్, ఇన్‌చార్జి కమిషనర్, నారాయణపేట మునిసిపాలిటీ

మునిసిపాలిటీల వారీగా మొత్తం నివాసాలు.. పన్ను వివరాలు

మున్సిపాలిటీ	మొత్తం నివాసలు	పన్ను (రూ.లక్షల్లో)
అలంపూర్	3,499	74.41
జోగుళాంబ గద్వాల	15,638	423.39
అయిజ	7,903	129.55
భూత్పురు	3,501	189.08
జడ్చర్ల	17,999	329.44
మహబూబ్‌నగర్	50,673	2015.72
అచ్చంపేట	6,498	203.99
కల్వకుర్తి	8,221	323.8
కొల్లాపూర్	6,353	86.65
నాగర్‌కర్నూల్	10,936	416.96
కోస్గి	6,221	133.1
మక్తల్	7,649	130.56
నారాయణపేట	9,224	254.92
అమరచింత	2,731	37.8
ఆత్మకూర్	5,299	131.97
పెబ్బరు	5,302	65.03
కొత్తకోట	7,140	95.21
వనపర్తి	17,783	477.35

ఉగ్ర భానుడు

- ధరూర్‌లో 43.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత



మధ్యాహ్నం వేళ నిర్మానుష్యంగా మారిన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తా

మహబూబ్‌నగర్/జోగుళాంబ గద్వాల/నాగర్‌కర్నూల్/నారాయణపేట, ఏప్రిల్ 4: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో భానుడు ఉగ్రరూపం దాలుస్తున్నాడు. అన్ని ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పైగానే నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు గురువారం రోడ్లపైకి రావడానికి ఇబ్బంది పడ్డారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో గరిష్ఠంగా 43.4 డిగ్రీలు నమోదైంది.

- జోగుళాంబ గద్వాల జిల్లా అంతటా 40 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత దాటి ఆరెంజ్ జోన్‌లోకి వెళ్లింది. ధరూర్‌లో 43.4 డిగ్రీలు, వడ్డేపల్లిలో 43.0, అలంపూర్, గద్వాలలో 42.5, ఇటిక్యాలలో 42.4, కేటీదొడ్డిలో 42.3, ఉండవెల్లిలో 41.7, అయిజ 41.7, మల్దకల్ 41.6, రాజోలిలో 40.7, మానవపాడు 40.6 గట్టు 39.3 డిగ్రీలుగా ఉన్నది. కనిష్ఠంగా 24నుంచి 26 డిగ్రీలు నమోదైంది.
- నాగర్‌కర్నూల్ జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రత 42 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 26 డిగ్రీలు నమోదైంది. చారగొండలో 42.1 డిగ్రీలు, అచ్చంపేటలో 41.9, కల్వకుర్తిలో 41.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.
- పాలమూరు జిల్లా గరిష్ఠ ఉష్ణోగ్రత 41 డిగ్రీలు కాగా, కనిష్ఠ ఉష్ణోగ్రత 27.5 డిగ్రీలుగా నమోదైంది. భూత్పూర్‌లో 40.8 డిగ్రీలు నమోదుకాగా దేవరకద్రలో 40 డిగ్రీలు గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. నారాయణపేట జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రత 41 డిగ్రీలు కాగా, కనిష్ఠంగా 27 డిగ్రీలు నమోదైంది. వనపర్తితో గరిష్ఠంగా 41 డిగ్రీలు, కనిష్ఠంగా 27 డిగ్రీలు నమోదైంది.



వేసవి తాపం నుంచి సేద తీరేందుకు చెరుకు రసం తాగుతున్న మహిళ







మద్యం పట్టివేత, కేసు నమోదు

రాజోలి, ఏప్రిల్ 4 : జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం, పచ్చర్లలోని కూల్ డ్రింక్ షాపులో మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు రాజోలి ఎస్ఐ జగదీశ్వర్ తెలిపారు. అయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం సమీపంలో ఆదే గ్రామానికి చెందిన బోయ దస్తగిరి అనే వ్యక్తి కూల్ డ్రింక్ షాపులో మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. షాపులో రూ. 5,500 విలువైన తొమ్మిది లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మామూళ్ల వసూలు : కేసు నమోదు

రాజోలి, ఏప్రిల్ 4 : ఇసుక, మట్టి తరలిస్తున్న వారి నుంచి మామూళ్లు వసూలు చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు రాజోలి ఎస్ఐ జగదీశ్వర్ తెలిపారు. అయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలికి చెందిన రైతులు పొలంలో కల్లాలు ఏర్పాటు చేసుకునేందుకు గురువారం నది నుంచి మట్టిని తరలిస్తున్నారు. మండలంలోని తూర్పు గార్లపాడు గ్రామానికి చెందిన చెందిన నాగేశ్వర్‌రెడ్డి అనే వ్యక్తి వారిని అడ్డుకొని, ఐదు వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. తాను విలేకరినని, కేసులు నమోదు చేయిస్తానిని బెదిరించాడు. రైతులు ఈ విషయాన్ని ఎస్ఐ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి విచారణ చేపట్టారు. సదరు నాగేశ్వర్‌రెడ్డి గతంలోనూ ట్రాక్టర్‌కు రెండు వేల చొప్పున డబ్బు వసూలు చేసినట్లు వెల్లడైంది. దీంతో అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అదుపుకాని మంటలు

- కొనసాగుతున్న సహాయక చర్యలు


ఇంకా మండుతున్న గన్నీ బ్యాగులు

పెబ్బేరు, ఏప్రిల్ 4: పెబ్బేరు మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు గోదాంలో జరిగిన అగ్ని ప్రమాదం మంటలు ఇంకా అదుపులోకి రాలేదు. గురువారం సాయంత్రం వరకు కూడా మంటలను అదుపు చేయడానికి ఫైర్ సిబ్బంది ప్రయత్నించారు. గోదాంలో కాలిపోయిన వరి ధాన్యాన్ని టిప్పర్ల ద్వారా బయటికి తీసి సీసీ బెడ్లపై అరబోశారు. దాదాపు 15వేల బ్యాగుల ధాన్యం కాలిపోయినట్లు సమాచారం. ఫైర్ సిబ్బంది నాలుగు రోజుల నుంచి ఇక్కడే ఉండి మంటలను అదుపు చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికి ఇంకా గోదాం ప్రమాదం వల్ల ఎంత నష్టం వాటిల్లింది అనే స్పష్టత రాలేదు. దీంతో పాటు ప్రమాదం ఏలా జరిగింది. ప్రమాదవశాత్తు జరిగిందా.. లేక ఎవరైనా కావాలని నిప్పు పెట్టారా అనే అంశాలపై స్పష్టత రాలేదు. జిల్లా స్థాయి అధికారులు పోలీసు సిబ్బంది విచారణ వేగవం తం చేశారు. ఎవరైనా కావాలని చేసి ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకునేం దుకు ప్రభుత్వం వెనుకాడే ప్రసక్తి లేదని అధికారులు చెబుతున్నారు. ఈ ప్రమాదంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు కావాలని నిప్పు పెట్టి ఉంటారని, మరికొందరు ఎండ వేడి వల్ల ప్రమాదం జరిగి ఉండొవచ్చని అంటున్నారు. గన్నీ బ్యాగుల లెక్కల కోసం ఈ సంఘటనకు పాల్పడి ఉంటారని మరికొందరు వాదిస్తున్నారు. ఏది ఏమైనా ప్రభుత్వ సొమ్మును ఇలా బుగ్గిపాలు చేయడాన్ని రైతులు, ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అధికారులు నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి నిజానిజాలు తేల్చాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.


నారాయణపేటలో 53.9 తులాల బంగారం పట్టివేత

అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తి బ్యాగులో లభించిన ఆభరణాలు

నారాయణపేట, ఏప్రిల్ 4 : పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలుతో నారాయణపేట జిల్లా కేంద్రంలోని మెయిన్ చౌక్‌లో గురువారం పోలీసులు తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి బ్యాగ్‌లో 53.9 తులాల బంగారం ఆభరణాలు లభించాయి. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం సాయంత్రం మెయిన్‌చౌక్‌లో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి బ్యాగ్ పట్టుకుని అనుమానాస్పదంగా తిరుగుతుండడాన్ని గమనించిన పోలీసులు అతన్ని పట్టుకుని బ్యాగ్‌ను తనిఖీ చేయగా అందులో బంగారం ఆభరణాలు లభించాయి. అనంతరం విచారించగా తన పేరు కాటబాతుల రాజు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, మంగళగిరిఅని చెప్పాడన్నారు. మంగళగిరిలో బంగారం ఆభరణాలు తయారు చేసి నారాయణపేట పట్టణంలోని షాప్స్‌లో అమ్మకానికి వచ్చినట్లు తెలిపాడన్నారు. బంగారానికి సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకున్న పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు తరలించి, గ్రీవెన్స్ కమిటీకి పంపించినట్లు ఎస్సై తెలిపారు.









అమరచింతలో వీగిన అవిశ్వాసం



అవిశ్వాసం వీగిపోవడంతో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌తో సమావేశమైన ఆర్డీవో, కమిషనర్

» 10 మంది కౌన్సిలర్లకు గాను నలుగురు హాజరు

» నెల రోజుల ఉత్కంఠకు తెర

» బీఆర్ఎస్ చైర్ పర్సన్‌కు మద్దతుగా సీపీఎం, బీజేపీ

అమరచింత, ఏప్రిల్ 4: వనపర్తి జిల్లా అమరచింత మునిసిపల్‌లో చైర్ పర్సన్, వైస్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం గురువారం కోరం లేక వీగిపోయింది. మునిసిపల్ అవిశ్వాసంపై నెల రోజుల ఉత్కంఠకు నేడు తెరపడింది. గురువారం ఆర్డీవో పద్మావతి సమక్షంలో నిర్ణీత ఉదయం 11 గంటలకు అవిశ్వాస తీర్మాన సమావేశాన్ని ప్రారంభించారు. మునిసిపాలిటీలో పది మంది కౌన్సిలర్లకు నలుగురు మాత్రమే హాజరయ్యారు. హాజరైన వారిలో సీపీఐ నుంచి విజయరాములు, బీఆర్ఎస్ నుంచి రాజశేఖర్ రెడ్డి, సింధు, టీడీపీ నుంచి లావణ్య ఉన్నారు. సమావేశానికి హాజరైన సభ్యులతో సంతకాలు చేయించుకున్నారు. కోరం సభ్యుల హాజరు కోసం సమావేశాన్ని 30 నిమిషాల పాటు వాయిదా వేశారు. తిరిగి సమావేశం 12 గంటలకు ప్రారంభమైంది. దీంతో మునిసిపల్ చైర్ పర్సన్ పై అవిశ్వాసం ప్రవేశ పెట్టగా పది నిమిషాలు సమయం ఇచ్చి 12:10 నిమిషాలకు సభ్యులు నలుగురు మాత్రమే ఉండడంతో చైర్ పర్సన్‌పై పై అవిశ్వాసం వీగిందని ఆర్డీవో అధికారికంగా ప్రకటించారు. తిరిగి 12:15 నిమిషాలకు వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం ప్రవేశ పెట్టి 12:25 నిమిషాల వరకు సమయం ఇచ్చారు. సభ్యులు నలుగురు మాత్రమే ఉండడంతో వైస్ చైర్మన్‌పై కూడా అవిశ్వాసం వీగిందని ఆర్డీవో అధికారికంగా ప్రకటించారు. దీంతో చైర్మన్, వైస్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోవడంతో హాజరైన నలుగురు సభ్యులు బయటికి వెళ్లిపోయారు. అనంతరం చైర్‌పర్సన్ మంగమ్మ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. తనకు సహకరించిన సీపీఎం, బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నాయకులకు తోటి కౌన్సిలర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

చక్రం తిప్పిన నాయకులు

మునిసిపల్ చైర్ పర్సన్, వైస్‌చైర్మన్‌పై అవిశ్వాసం వీగడానికి తెర వెనుక నాయకులు చక్రం తిప్పారు. రాష్ట్ర బీఆర్ఎస్ యూత్ వింగ్ మాజీ అధ్యక్షుడు ప్రస్తుత కాంగ్రెస్ నాయకులు ఒకరు అవిశ్వాసం ముందు వారం రోజులుగా అమరచింతలోనే మకాం వేసి సీపీఎం రాష్ట్ర నాయకులతో, బీజేపీ నాయకులతో రహస్యంగా సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. సీపీఎం రాష్ట్ర నాయకులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు , కాంగ్రెస్ సీనియర్ ముఖ్య నాయకులు సైతం ఏకాభిప్రాయానికి వచ్చి అవిశ్వాసం వీగడానికి కృషి చేసినట్లు తెలిసింది. ఇందులో భాగంగానే సీపీఎం సమావేశానికి ముందే విప్ జారీ చేయడం బీజేపీ సమావేశానికి కొన్ని గంటల ముందే వారి కౌన్సిలర్‌ను సమావేశానికి హాజరు కాకుండా ఆపడం వ్యూహంలో భాగంగా జరిగిందని చెప్పవచ్చు. సీపీఎం 6వ వార్డు కౌన్సిలర్‌పై కొంత సందేహం ఉండడంతో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌తో పాటు వారికి మద్ధతుగా ఉన్న కౌన్సిలర్లు, బీఆర్ఎస్, సీపీఎం, సీనియర్ నాయకులు సైతం ఆమె దగ్గరే ఉండడం గమనార్హం. మునిసిపల్ కార్యాలయం ఆవరణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ శివశంకర్, ఎస్ఐ సురేష్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మోదీతోనే సమస్యల పరిష్కారం



ర్యాలీలో పాల్గొన్న డీకే అరుణ

- బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ

కోస్గిరూరల్, ఏప్రిల్ 4 : దేశంలో ఏళ్ల తరబడి కాంగ్రెస్ పరిష్కరించని ఎన్నో సమస్యలకు మోదీ పరిష్కార మార్గం చూపారని పాలమూరు బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే.అరుణ అన్నారు. గురువారం నారాయణపేట జిల్లా కోస్గి పట్టణంలోని శివాజీ కూడలి నుంచి పాలిటెక్నిక్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రైస్‌మిల్లు వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పాలమూరు గడ్డపై బీజేపీ జెండా ఎగరవేసి, దేశంలో మరోమారు నరేంద్రమోదీని ప్రధానమంత్రిని చేయాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే దేశం ఆగమవుతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయడం లేదన్నారు. అనంతరం పలువురు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సీటీ.వెంకటేష్, పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు ప్రతాప్‌రెడ్డి, భద్రి, నారాయణ, రమేష్ తదితరులున్నారు.

'గ్రామకంఠం ధారాదత్తం'పై విచారణ

» ఆంధ్రజ్యోతి కథనంపై స్పందించిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గద్వాల, ఏప్రిల్ 4 : జోగుళాంబ గద్వాల జిల్లా, గద్వాల మండల పరిధిలోని గోనుపాడులో గ్రామకంఠం ధారాదత్తంపై గురువారం అధికారులు విచారణ నిర్వహించారు. గత నెల 27న 'ఆంధ్రజ్యోతి'లో గ్రామకంఠం ధారాదత్తంపై కథనం ప్రచురితమైంది. కలెక్టర్ విచారణకు ఆదేశించినా, రాజకీయజోక్యంతో నిలిచిపోయిన విషయాన్ని అందులో ప్రస్తావించింది. దీంతో అధికారులు ఎట్టకేలకు విచారణ చేపట్టారు. ఎంపీడీవో ఉమాదేవి, ఎంపీవో చెన్నయ్య గ్రామస్థుల సమక్షంలో విచారణ నిర్వహించారు. స్థలాలు ప్రైవేట్ వ్యక్తులవా? ముందు నుంచి గ్రామ కంఠంలో వృథాగా ఉన్న స్థలాలా? తెలుసుకున్నారు. గతంలో ఇవి బ్రాహ్మణులకు చెందిన ఇళ్ల స్థలాలని తేలింది. ఇవి గ్రామకంఠానికి సంబంధించినవి కాదని గతంలో తీర్మానం చేసిన విషయాన్ని పరిశీలించారు. ఈ స్థలాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఉండటంతో, పూర్తి వివరాలతో కలెక్టర్‌కు నివేదిక అందిస్తామని ఎంపీడీవో తెలిపారు.



గోనుపాడు గ్రామంలో విచారణ చేస్తున్న అధికారులు

అయోధ్యలో మహిళ అదృశ్యం

మన్ననూర్, ఏప్రిల్ 4: అయోధ్య రామాలయం దర్శనానికి వెళ్లే క్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామానికి చెందిన ఓ మహిళ తప్పిపోయిన విషయం గురువారం వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామానికి చెందిన తోటపల్లి వెంకటమ్మ కొండనాగుల, పదర గ్రామాలకు చెందిన 18 మంది ఒక ప్రైవేటు బస్సులో వారం రోజుల క్రితం అయోధ్యతో పాటు ఇతర పుణ్య క్షేత్రాల చూసేందుకు బయలుదేరి వెళ్లారు. బుధవారం అయోధ్యలోని రామాలయం దర్శనం నిమిత్తం సహచరులంతా కలిసి ఆటోలో ఆలయ ప్రాంగణానికి వెళ్తుండగా వెంకటమ్మ ఆటో దిగింది. తన వద్ద ఉన్న ఏదో వస్తువు మరిచిపోయానని, తీసుకువస్తానని సహచరులతో చెప్పి వెళ్లింది. వారు కాసేపు ఆమె కోసం వేచిచూడగా ఆటో వద్దకు రాలేదు. ఆలయ పరిసరాల్లో, ఇతర ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో మన్ననూరులోని కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందించారు. దాంతో వెంకటమ్మ కుమారులు రమేష్, నరేష్ హైదరాబాద్ నుంచి బుధవారం రాత్రి అయోధ్యకు బయలు దేరి వెళ్లారు. వెంకటమ్మ తప్పిపోయిన ప్రాంతంలో వెదికినా ఆచూకీ దొరకలేదు. దీంతో అయోధ్యలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రెండు రోజులుగా ఆచూకీ తెలియకపోవడంతో మన్ననూరులోని ఆమె బంధువులు ఆందోళనకు గురవుతున్నారు.

జేఈఈ మెయిన్స్‌కు 72 మంది గైర్హాజరు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 4 : ఎన్ఐటీ, ఐఐటీ ప్రవేశాలకు సంబంధించి జేఈఈ మెయిన్స్ -2 ప్రవేశపరీక్ష గురువారం జిల్లా కేంద్రంలోని జేపీఎన్‌సీఈ, ఫాతిమా విద్యాలయంలో నిర్వహించారు. ఈ పరీక్షకు జేపీఎన్‌సీలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో ఉదయం నిర్వహించిన పరీక్షకు 180 మంది హాజరు కావాల్సి ఉండగా 161 మంది విద్యార్థులు హాజరుకాగా 19 మంది హాజరుకాలేదు. మధ్యాహ్నం షిఫ్ట్‌లో నిర్వహించిన పరీక్షకు 180 మందికి గాను 163 మంది హాజరుకాగా 17 మంది విద్యార్థులు హాజరుకాలేదు. ఫాతిమా విద్యాలయంలో నిర్వహించిన పరీక్ష కేంద్రంలో 180 మందికి గాను 161 మంది హాజరు కాగా 19 మంది హాజరు కాలేదు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 180 మంది విద్యార్థులకు గాను 163 మంది హాజరుకాగా 17 మంది హాజరుకాలేదు. రెండు కేంద్రాలలో 72 మంది విద్యార్థులు హాజరు కాలేదు. పరీక్ష కేంద్రాలను సాంకేతిక విద్యాశాఖ అధికారులు పరిశీలించారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

బల్మూరు, ఏప్రిల్ 4 : అదనపు కట్నం తీసుకురావాలంటూ తరచూ మానసికంగా శారీరకంగా హింసించడంతో వివాహిత మహిళ ఆస్కాని భార్గవి(22) ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాలరాజు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్ కర్నూల్ జిల్లా బల్మూరు మండలంలోని రామచపల్లి గ్రామానికి చెందిన భార్గవిని బిజినేపల్లి మండల కేంద్రానికి చెందిన ఆస్కాని రామకృష్ణకు 2021వ సంవత్సరంలో పెద్దల సమక్షంలో పెళ్లి నిర్వహించారు. అప్పట్లో 12తులాల బంగారంతో పాటు 4లక్షల నగదు ఇచ్చి ఘనంగా వివాహం చేశారు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. వివాహమైన తర్వాత 4నెలలు మాత్రమే బాగా చూసుకున్నాడని, తర్వాత నుంచి అదనపు కట్నం తేవాలని భర్త ఆస్కాని రామకృష్ణతో పాటు అత్త అంజిత, మామ శ్రీనివాసులు కలిసి నిరంతరం మానసికంగా శారీరకంగా హింస పెట్టి ఇంటి నుంచి వెళ్లకొట్టారని ఈ సందర్భంగా ఆమె ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

ఇసుకను ట్రాక్టర్ పట్టివేత

రాజాపూర్, ఏప్రిల్ 4 : అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని మల్లేపల్లి గ్రామం నుంచి బుధవారం రాత్రి గ్రామ శివారులోని ఉన్న దుందుభీ వాగులో ఇసుకను అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుడంతో విధుల్లో ఉన్న కానిస్టేబుల్ ఆనంద్, శ్రీనివాసులు పట్టుకునట్లు, ఇసుకకు సంబంధించిన పత్రాలు అడగడంతో ఎలాంటి పత్రాలు లేవని ట్రాక్టర్ డ్రైవరు చెప్పడంతో పట్టుబడిన ట్రాక్టర్‌పై, డ్రైవరుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గట్టు ఉమ్మెన్ స్టేజీ వద్ద..

బల్మూరు: మండల పరిధిలోని గట్టుతుమ్మెన్ స్టేజ్ సమీపంలో బుధవారం రాత్రి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా విధులు నిర్వహిస్తున్న పోలీసులు శంకర్‌నాయక్, కృష్ణయ్యలు ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఇసుక తరలిస్తున్న పత్రాలను చూపాలని డ్రైవర్‌ను ప్రశ్నించగా ఎలాంటి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌తో పాటు అతని యజమాని లింగాల మండలం అవసలికుంట గ్రామానికి చెందిన సుధాకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాలరాజు తెలిపారు.

బహుజనుల త్యాగాలతోనే తెలంగాణ



సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

● జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

తెలకపల్లి, ఏప్రిల్ 4 : బహుజనుల త్యాగాలతో ఏర్పాటైన తెలంగాణ రాష్ట్రం పరిపాలనలో మాత్రం బీసీ బహుజన కులాలకు పదవులు దక్కకుండా అగ్రవర్ణాల చేతిలో పరిపాలన ఉండి బీసీ బహుజనుల వర్గాలకు పదవుల విషయంలో సామాజిక న్యాయం లభించలేదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రానికి చేరుకున్న ఆయన అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 60శాతం ఉన్న బీసీ బహుజనుల కులాలు కనీస పరిపాలన స్థానాలను ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేయకపోవడం దారుణమని, ఈ వైఖరి మార్చుకోవాలని అన్నారు. బహుజనులకు సామాజిక న్యాయం జరిగేంత వరకు ప్రతి బహుజనుడు పోరాడాల్సిన సామాజిక తిరుగుబాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు పార్టీలు కుల సిద్ధాంతాలతో మత సిద్ధాంతాలతో కాకుండా జనాభా దామాషాతో బీసీ బహుజన కులాలకు సామాజిక న్యాయం చేయాలని, లేదంటే బహుజనులను కూడగట్టుకుని కులమత పార్టీలకు వ్యతిరేకంగా ఉద్యమాలు కొనసాగిస్తామని అన్నారు. బీసీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్, బీసీ జన సైన్యం రాష్ట్ర అధ్యక్షుడు సింగం నాగేష్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొడుగు మహేష్, ఎంబీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పిబడేసాబ్, గౌడ సంఘం కార్యదర్శి తిరుపతయ్యగౌడ్, మండల బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

బీసీలను విస్మరిస్తే గుణపాఠం తప్పదు

అచ్చంపేట : బీసీలను విస్మరిస్తే రాజకీయ పార్టీలకు గుణపాఠం తప్పదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాసులు అన్నారు. గురువారం అచ్చంపేటలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు ఎన్నికల్లో 17 స్థానాలలో 9 స్థానాలు బీసీలకు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. అనిల్ మహేశ్ రాజు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

» స్టీరింగ్ స్ట్రక్ కావడంతో రోడ్డు దిగిన స్కూల్ బస్సు

» సడన్ బ్రేక్‌తో పిల్లలకు స్వల్ప గాయాలు



రోడ్డు పక్కకు దూసుకెళ్లిన స్కూల్ బస్సు

గట్టు, ఏప్రిల్ 4 : విద్యార్థులతో వెళ్తున్న ప్రైవేట్ స్కూల్ బస్సుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండల పరిధిలోని చమాన్‌ఖాన్‌దొడ్డి, ఇందువాసి గ్రామాల మధ్యలో గురువారం ఈ సంఘటన జరిగింది. బల్గెర వద్ద ఉన్న గీతం ఇంగ్లిష్‌మీడియం పాఠశాలకు చెందిన బస్సు గురువారం మధ్యాహ్నం పాఠశాల సమయం ముగిసిన తర్వాత ఇందువాసి, బోయలగూడెం గ్రామాలకు చెందిన దాదాపు 50 మంది విద్యార్థులతో బయలు దేరింది. ఇందువాసి సమీపంలో బస్సు స్టీరింగ్ స్ట్రక్ కావడంతో అదుపు తప్పింది. రోడ్డు కిందకు దిగి ఎత్తుగా ఉన్న మట్టిగడ్డకు తగిలి నిలిచిపోయింది. బస్సు రోడ్డు పక్కకు దిగగానే డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో అందులోని విద్యార్థులు భయభ్రాంతులకు గురయ్యారు. కొందరు పిల్లలకు ముందు సీట్లు తగిలి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన చుట్టుపక్కల పొలాల్లో ఉన్న రైతులు, ఆ దారిలో వెళ్తున్న వాహనదారులు బస్సు వద్దకు చేరుకొని చిన్నారులకు ధైర్యం చెప్పారు. వారిని నెమ్మదిగా బస్సులోనుంచి కిందకు దించి ఓ చెట్టు నీడన కూర్చోబెట్టారు. పాఠశాల యాజమాన్యానికి, తల్లిదండ్రులకు సమాచారం అందించారు. దీంతో వారందరూ అక్కడకు చేరుకొని పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లారు. బస్సు మట్టి గడ్డకు తగిలి నిలిచిపోవడంతో ప్రమాదం తప్పింది.

8.41 లక్షల నగదు పట్టివేత



గట్టులో తనిఖీలు చేస్తున్న పోలీసులు

రాజాపూర్, ఏప్రిల్ 4 : మండలంలోని రంగారెడ్డిగూడ శివారులోని జాతీయ రహదారి 44పై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు దగ్గర గురువారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎలాంటి పత్రాలు లేకుండా ఓ డీసీఎంలో ఒక లక్ష, మరో డీసీఎంలో మరో లక్ష, బొలెరో వాహనంలో 6.41 లక్షలు మొత్తం 8.41 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రవి తెలిపారు. ఆ రూపాయలు హైదరాబాద్ నుంచి ఆత్మకూర్‌కు వెళ్తున్న రమేష్ బాబు, మరో వ్యక్తి వెంకటేష్, షహిల్‌భాషల నుంచి స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న రూపాయలను జిల్లా ఎన్నికల అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

అమరచింతలో..

అమరచింత: మండల కేంద్రం నుంచి ఆత్మకూరుకు వెళ్తుండగా ఓ వ్యక్తి వద్ద గురువారం రూ.87, 500 పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. అమరచింత నుంచి ఆత్మకూరు వైపు వాహనంలో వెళ్తున్న ప్రకాష్‌రెడ్డిని తనిఖీ చేయగా నిబంధనలకు విరుద్ధంగా రూ.87,500లకు సరైన ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం పరుచుకున్నట్లు ఆయన తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో ఎన్నికల నియమావళిని ప్రతీ ఒక్కరు పాటించాలని లేని పక్షాన చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

జోగుళాంబ గద్వాల జిల్లాలో..

గద్వాల క్రైం/ అలంపూర్ చౌరస్తా: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీస్‌స్టేషన్ల పరిధిలో, సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద పోలీస్ అధికారులు గురువారం నిర్వహించిన తనిఖీల్లో రూ. 4,73,500 స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్పీ రితిరాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గట్టు స్టేషన్ పరిధిలో రూ. 2,76,000 లభించగా, పుల్లూరు టోల్‌ప్లాజా చెక్‌పోస్ట్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో రూ.1,97,500 లక్షల నగదు పట్టుకున్నట్లు ఉండవెల్లి ఏఎస్ఐ సుబ్బారెడ్డి తెలిపారు. టోల్‌ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా కర్నూలు నుంచి హైదరాబాద్ వైపు వస్తున్న ఓ ప్యాసింజర్ వాహనంలో జయకృష్ణ అనే జేసీబీ డ్రైవర్ వద్ద లక్ష రూపాయలు, ప్రొద్దుటూరు నుంచి వస్తున్న కారులో హారీఫ్‌ఉల్లా అనే వ్యక్తి వద్ద రూ.97 వేల రూపాయలు లభించాయి. వారి వద్ద నగదుకు సంబంధించిన ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసి జిల్లా ఎన్నికల గ్రీవెన్స్ రిడ్రెసల్ కమిటీకి అప్పగించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎవరూ 50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్లొద్దని, ఒకవేళ తీసుకెళ్తే తగిన రశీదులు, పత్రాలు వెంట ఉంచుకోవాలని ఎస్పీ సూచించారు.

అవినీతిపై పోరాడుతాం : సీపీఐ

అమరచింత, ఏప్రిల్ 4: మునిసిపల్ అవిశ్వాసం వీగిపోయినప్పటికీ మునిసిపాలిటీలో జరిగిన అవినీతి అక్రమాలపై తమ కౌన్సిలర్‌లతో కలిసి పోరాటాలను కొనసాగిస్తామని కౌన్సిలర్, సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు అన్నారు. గురువారం ఆయన కౌన్సిలర్లతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అవినీతిపై అవిశ్వాసం పెడితే కొంతమంది రాజకీయ నాయకులు ఏకమై అవిశ్వాసాన్ని వీగేటట్టు చేశారని అన్నారు. చైర్ పర్సన్, వైస్ చైర్మన్‌లు తప్పు చేయకుంటే అవిశ్వాస సమావేశానికి ఎందుకు హాజరు కాలేదని ఆయన ప్రశ్నించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గోపాల్‌పేట, ఏప్రిల్ 4: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గోపాల్‌పేటకు చెందిన జినిగాడి నరసింహ (44) మండల కేంద్రంలోని ఓ రైస్ మిల్లులో పని చేస్తున్న సమయంలో శనివారం సాయంత్రం ఛాతినొప్పి వచ్చిందని భార్యతో కలిసి వనపర్తిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లారు. చికిత్స చేయించుకుని ఇంటికి వచ్చారు. శనివారం అర్ధ రాత్రి సమయంలో నరసింహకు నొప్పి అధికమవడంతో మహబూబ్‌నగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఓ కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. నరసింహ కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని గ్రామస్థులు అధికారులను కోరారు.

బెల్ట్‌షాపులో మద్యం స్వాధీనం

ఉండవల్లి, ఏప్రిల్ 4 : జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని ప్రాగటూర్ గ్రామంలోని బెల్ట్‌షాపుపై పోలీసులు దాడి చేసి, మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మోహన్‌రాజు అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో గురువారం ఏఎస్ఐ సుబ్బారెడ్డి తన సిబ్బందితో కలసి దాడి చేశారు. రూ. 8,690 విలువైన 9.9 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

41 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

కొత్తకోట, ఏప్రిల్ 4: వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలో అక్రమంగా నిల్వ చేసిన 41 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గురువారం పట్టుకున్నారు. ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు రాయనిపేట గ్రామానికి చెందిన నక్క కుమార్ ఇంట్లో రేషన్ బియ్యం నిల్వ చేసినట్లు వచ్చిన సమాచారం మేరకు రెవెన్యూ, సివిల్ సప్లయ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పోలీసులతో కలిసి తనిఖీ చేశారు. కుమార్ ఇంట్లో 72 సంచుల్లో ఉన్న బియ్యం స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కుమార్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

గద్వాల క్రైం, ఏప్రిల్ 4 : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో గల ఓ ఇంట్లో గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. బాధితుడు శంకరయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శంకరయ్య తన ఇంట్లో పేటీఎం యంత్రానికి చార్జింగ్ పెడ్తుండగా షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. పరుపుతో పాటు ఇంట్లోని వస్తువులు కాలి బూడిదయ్యాయి. దాదాపు లక్ష రూపాయల వరకు నష్టం జరిగింది. బాధితుడు సమాచారం అందించడంతో అగ్నిమాపక శాఖ అధికారి పాషాతో పాటు సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు.

ఈతకు వెళ్లి బావిలో పడి యువకుడి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం, ఏప్రిల్ 4 : ఈతకు వెళ్లి బావిలో పడి యువకుడు మహేష్(24)మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ మండలంలోని శ్రీపురం గ్రామంలో చోటు చేసుకున్నట్లు ఎస్ఐ-2 రామేశ్వర్‌రెడ్డి గురువారం తెలిపారు. వివరాల ప్రకారం.. శ్రీపురం గ్రామానికి చెందిన మహేష్ బుధవారం ఈతకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి గ్రామ సమీపంలోని మొగిలి బావిలో ఈతకు వెళ్లి గల్లంతయ్యాడు. గురువారం శవమై తేలడంతో మృతుని తండ్రి బంగారయ్య నాగర్‌కర్నూల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామేశ్వర్‌రెడ్డి తెలిపారు.

వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏవో

చిన్నచింతకుంట, ఏప్రిల్ 4 : మండలంలోని కురుమూర్తి, తిర్మలాపూర్ గ్రామాల్లో గురువారం అప్పంపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. వరి కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని, దళారులను నమ్మి మోసపోరాదని అధికారులు రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ రాజేష్‌ఖన్నా, ఏఈవో సంతోష్, సీఈవో బషీర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం



కావలి ప్రకాష్ (ఫైల్)

మాగనూరు, ఏప్రిల్ 4 : రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం పాలైన సంఘటన నారాయణపేట జిల్లా కృష్ణ మండలం ఆనంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కావలి ప్రకాష్(14) కున్సీ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. రోజు మాదిరిగానే గురువారం పాఠశాలకు తోటి స్నేహితులతో కలిసి సైకిల్‌పై పాఠశాలకు బయలుదేరాడు. కున్సీ గ్రామ స్టేజీ సమీపంలో పత్తి లోడుతో వెనుకాల వచ్చిన ట్రాక్టర్‌కు సైడ్ ఇస్తుండగా ట్రాక్టర్ ట్రాలీ ప్రకాష్‌ను బలంగా తాకింది. దీంతో అతను ట్రాలీ కింద పడిపోవడం, తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రకాష్ వెంట సైకిల్‌పై వస్తున్న స్నేహితులు విషయాన్ని కున్సీ గ్రామస్థులకు తెలుపగా వారు వెంటనే కుటుంబీకులకు సమాచారం అందించారు. విద్యార్థి ప్రకాష్ మృతితో పాఠశాలతో పాటు, ఆనంపల్లి గ్రామంలో విషాదం నెలకొంది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లిక్కర్ పట్టివేత

నారాయణపేటరూరల్, ఏప్రిల్ 4 : పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో భాగంగా నారాయణపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు గురువారం విస్తృత తనిఖీలు చేపట్టారు. పట్టణం నుంచి కొల్లంపల్లికి ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 46.65 లీటర్ల లిక్కర్‌ను పేట అంబేడ్కర్ చౌరస్తా వద్ద పోలీసులు పట్టుకున్నారు. వాటి విలువ రూ.33,080 ఉంటుందని ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. జాకీర్‌హుసేన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్‌లో భాగంగా ప్రజలు అక్రమంగా నగదు, లిక్కర్ రవాణా చేయొద్దని సూచించారు.

ఉప్పునుంతలలో..

ఉప్పునుంతల: నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల పరిధిలోని మొల్గర గ్రామానికి చెందిన గజ్జే కృష్ణయ్యగౌడ్ గురువారం ఉప్పునుంతల వైన్స్ నుంచి 12 బీర్లను మొల్గర గ్రామానికి తీసుకపోవడానికి ఉప్పునుంతల బస్టాండ్‌లో ఉన్నారు. ఎస్సై లెనిన్‌తో పాటు సిబ్బంది పట్టుకొని బీర్లు స్వాధీనం చేసుకొని పంచనామా నిర్వహించారు. కృష్ణయ్యగౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బాలకిష్టాపూర్‌లో ఎక్సైజ్ దాడులు

ఆత్మకూరు, ఏప్రిల్ 4: మండలంలోని బాలకృష్ణాపూర్‌లో బుధవారం ఎక్సైజ్ సీఐ రమేష్ రెడ్డి, ఎస్ఐ కృష్ణ కాంత్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ కృష్ణకాంత్ తెలిపారు. సారా తయారీ కేంద్రాలను ధ్వంసం చేశామని తెలిపారు. అలాగే ఆత్మకూరు పట్టణంలో నారమ్మ అనే మహిళ సారా విక్రయం జరుపుతుండడంతో ఆమెపై కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. పట్టణ కేంద్రంలోని ఓ కిరాణంలో బెల్లం విక్రయాలు జరుపుతుండగా 60 కేజీల నల్ల బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

సారా తరలిస్తున్న వ్యక్తి బైండోవర్

మహబూబ్‌నగర్: సారా తరలిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకుని లక్ష రూపాయలకు బైండోవర్ చేశారు. ఎక్సైజ్ సీఐ వీరారెడ్డి వివరాల ప్రకారం హన్వాడ మండలం వెంకటమ్మకుంట తాండ వద్ద గురువారం తెల్లవారుజామున ఎక్సైజ్ పోలీసులు రూట్‌వాచ్ చేస్తుండగా హన్వాడకు చెందిన విస్లావత్ రఘు ద్విచక్ర వాహనంపై నాటుసారా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అతనివద్ద 6 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదుచేసి హన్వాడ తహసిల్దార్ ముందు లక్ష రూపాయలకు బైండోవర్ చేశారు.

హన్వాడలో..

హన్వాడ: అక్రమంగా కిరాణ షాప్‌లో మద్యాన్ని అమ్ముతున్న వారిని పోలీసులు పట్టుకొని తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు. మండలంలోని టంకర గ్రామానికి చెందిన సుధాకర్‌గౌడ్, మునిమోక్షం గ్రామానికి చెందిన పెంటయ్యలు తమ షాప్‌లలో మద్యాన్ని అమ్ముతున్న సమాచారంతో పోలీసులు పట్టుకొని గురువారం తహసీల్దార్ కిష్యానాయక్ ముందు వారిని బైండోవర్ చేశారు. మరోమారు మద్యం అమ్మినట్లు పట్టుబడితే లక్ష రూపాయలు జరిమానా విధిస్తానని వారిని తహసీల్దార్ హెచ్చరించారు.

బైక్ అదుపుతప్పి కిందపడి వ్యక్తి మృతి

బిజినేపల్లి, ఏప్రిల్ 4 : బంధువుల వివాహ వేడుకలో పాల్గొని స్వంత గ్రామానికి తిరిగి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అదుపుతప్పి కిందపడి కృష్ణయ్య(50) అనే వ్యక్తి మృతి చెందాడు. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. గురువారం బిజినేపల్లి మండలంలోని పాలెంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో బంధువుల వివాహానికి భార్య యాదమ్మతో కలిసి ద్విచక్ర వాహనంపై వచ్చాడు. వివాహం అనంతరం ఎండలు ఎక్కువగా ఉండడంతో భార్యను బస్సు ఎక్కించి మృతుడు కృష్ణయ్య బైక్‌పై స్వంత గ్రామం నాగర్‌కర్నూల్ మండలంలోని నాగనూలుకు బయలుదేరాడు. మండలంలోని కోట్రాల్ గడ్డ గ్రామంలోని విష్ణు పబ్లిక్ స్కూల్ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108కు సమాచారం ఇచ్చి నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు రవి, శివ, కూతురు శివలీల ఉన్నారు.

అనంతసాగర్ గేటు వద్ద..

తెలకపల్లి: మండల పరిధిలోని అనంతసాగర్ గేటు దగ్గర గురువారం సాయంత్రం తెలకపల్లి వైపు నుంచి బైకుపై వస్తున్న వ్యక్తి అదుపు తప్పి కింద పడడంతో గాయాలయ్యాయి. గన్యాగులకు చెందిన వ్యక్తిస్వామిగా ప్రయాణికులు చెబుతున్నారు. అతనిని చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్‌కు పంపించినట్లు ప్రయాణికులు తెలిపారు. పూర్తివివరాలు తెలియరాలేదు.

తాండ్ర గేటు వద్ద..

కల్వకుర్తి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు స్థానికుల కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం తాండ్ర గ్రామానికి చెందిన యు.విజయ్ కుమార్‌రెడ్డి స్వగ్రామం నుంచి తాండ్ర గేటు సమీపంలో రోడ్డు దాటుతుండగా కల్వకుర్తి వైపు నుంచి వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విజయ్‌కుమార్‌రెడ్డి తలకు, కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే స్థానికులు కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వైద్యులు హైదరాబాద్‌కు రెఫర్ చేశారు.

మర్రిపల్లిలో ఈదమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ



ఈదమ్మతల్లికి బోనాలను తీసుకెళ్తున్న మహిళలు

చారకొండ, ఏప్రిల్ 4: మండల పరిధిలోని మర్రిపల్లిలో వడ్డెర కులస్థుల ఆరాధ్యదైవమైన ఈదమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బాజాభజంత్రీల నడుమ పూజారులు అంగరంగవైభవంగా నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం మహిళలు బోనం కుండలను తలపై పెట్టుకొని బ్యాండు మేళాల నడుమ ఆలయం వద్దకు చేరుకుని ఆలయం చుట్టు తిరిగి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మర్రిపల్లి మాజీ సర్పంచ్ అంగోత్ నరేష్‌నాయక్, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు జమ్మికింది బాల్‌రాంగౌడ్ ఈదమ్మతల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాండు, శ్రీనయ్య, కొండల్, యాదయ్య, విష్ణు, వెంకటయ్య సత్తయ్య, రాములు, రమేష్, సైదులు, పున్నయ్య, స్వామి, వడ్డెర కులస్థులు, గ్రామపెద్దలు, మహిళలు, యువతి యువకులు పాల్గొన్నారు.

ఘనంగా నాసర్ స్వామి రాతి స్తంభ ప్రతిష్ఠ



రాతి ధ్వజ స్తంభం వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మన్ననూర్, ఏప్రిల్ 4: అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలోని నాసర్ స్వామి దర్గా వద్ద నూతన రాతి స్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. నూతన రాతి స్తంభం వద్ద అభిషేకం, కుంకుమార్చనలు చేశారు. ఈ సందర్భంగా నాసర్ స్వామి భక్త బృందం ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. దర్గా కమిటీ సభ్యులు నిరంజన్, అంబ నారాయణ, రామకృష్ణ, నాసరమ్మ, నారమ్మ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలి

- జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ కే సుధాకర్‌లాల్

కందనూలు, ఏప్రిల్ 4 : జిల్లాలో ఎండ తీవ్రత క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బకు గురి కాకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ కే సుధాకర్‌లాల్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. తీవ్రమైన ఎండ, వేడిగాలులు వీచినప్పుడు ప్రజలు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని, అందుకుగాను ముందు జాగ్రత్తలు పాటిస్తూ తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎండలు ఎక్కువగా ఉన్నందున బయటకు వెళ్లినప్పుడు తప్పనిసరిగా గొడుగును వాడాలని, ఎండకు బయటకు వెళ్లిన సమయంలో తెల్లని లేదా ఇతర రంగులు కాటన్, నూలు వస్త్రాలు ధరించాలని పేర్కొన్నారు. ఉపాధిహామీ పనులకు వెళ్లేవారు వారి వెంట కావాల్సినంత నీటిని ఇతర ద్రావణాలను తీసుకెళ్లాలని, నీడ కోసం టెంట్లను వేయించాలని పేర్కొన్నారు. ఈ సంవత్సరం ఎండలు, వడగాల్పుల తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ ప్రకటించిందన్నారు. జిల్లాలోని ప్రజల అవగాహన కోసం జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని తహసీల్దార్ ఆఫీసుల్లో, అన్ని మండల పరిషత్ ఆఫీసుల్లో, పోలీస్‌స్టేషన్లలో, గ్రామపంచాయతీల్లో ఓఆర్ఎస్, కార్నర్‌లను ఏర్పాటు చేసినట్లు జిల్లా వైద్యాధికారి పేర్కొన్నారు.

రేపు జనజాతరను విజయవంతం చేయాలి

- బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితి విజయ్‌కుమార్‌రెడ్డి

వెల్దండ, ఏప్రిల్ 4 : కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 6న తుక్కుగూడలో నిర్వహించే జనజాతరకు పార్టీ శ్రేణులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితి విజయ్‌కుమార్‌రెడ్డి కోరారు. గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ పార్టీ అగ్రనేతలు మలికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీలు హాజరయ్యే ఈ బహిరంగ సభలో ఐదు న్యాయ గ్యారెంటీలపై మేనిఫెస్టో విడుదల చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే గ్యారెంటీలను అమలుచేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలలో ఇప్పటికే ఐదు గ్యారెంటీలను అమలుచేశామని తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు 2500 రూపాయలు ఇవ్వనున్నట్లు చెప్పారు. జిల్లాలోని నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ పార్లమెంటు స్థానాలలో కాంగ్రెస్ విజయం సాధించనున్నట్లు విజయ్‌కుమార్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

నీటి సంరక్షణ చేపట్టాలి



మంగనూర్‌లో నీటి సంరక్షణపై రైతులకు అవగాహన కల్పిస్తున్న రావేఫ్ విద్యార్థినులు

బిజినేపల్లి, ఏప్రిల్ 4 : వానాకాలం సీజన్‌లో అధికంగా ఉండే వర్షపాతాన్ని వృథా కాకుండా నీటి సంరక్షణ మెలకువలపై రైతులకు రావేఫ్ విద్యార్థులు అవగాహన కల్పించారు. మండలంలోని మంగనూర్‌లో గ్రామీణ వ్యవసాయ అనుభవ కార్యక్రమంలో భాగంగా గురువారం రైతులకు నీటి కుంటలు, నేల కోతను అరికట్టడం, మల్చింగ్ ద్వారా నీరు ఆవిరి కాకుండా అరికట్టడం వంటి అంశాలను వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో సరాసరి వర్షపాతం 905 మి.మీ ఉండగా నైరుతి రుతుపవనాల ద్వారా 76 శాతం, ఈశాన్య రుతుపవనాల ద్వారా 17 శాతం, వేసవిలో 4 శాతం వర్షపాతం నమోదవుతుందని అన్నారు. ఎర్రనేలలో ప్రతి రెండు నుంచి మూడు మీటర్ల ఎడంలో దుంప నాగలితో గొడ్డు సాలు ఏర్పాటు చేస్తే తేమను అరికట్టవచ్చని తెలిపారు. నీటిగుంటల ద్వారా వాన నీటిని పూర్తిగా సంరక్షించుకొని నీటి ఎద్దడి ఉన్నప్పుడు వినియోగించుకోవచ్చని అన్నారు. మల్చింగ్ పద్ధతిలో పంటల సాగు చేపడితే ఎండ వేడిమి, గాలి ద్వారా నేలలోని నీటి తేమ ఆవిరి కాకుండా అరికట్టవచ్చని రైతులకు సూచించారు. రావేఫ్ విద్యార్థినులు వైష్ణవి, ప్రణయ, వైష్ణవి రెడ్డి, నివేదిత, నిహారిక ఉన్నారు.

వృత్తి ధర్మాన్ని చాటుకున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

అచ్చంపేట, ఏప్రిల్ 4: ఎమ్మెల్యే అయిన డాక్టర్ వంశీకృష్ణ వైద్యుడిగా తన వృత్తి ధర్మాన్ని నెరవేరుస్తూ ప్రజల మన్ననలు అందుకుంటున్నారు. తాజాగా గురువారం బల్మూరు మండలం కొండనాగుల గ్రామానికి చెందిన అనిత అనే మహిళకు అచ్చంపేట సివిల్ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స నిర్వహించి కడుపులో ఉన్న 10 కిలోల కణితిని తొలగించారు. నిరుపేద కుటుంబానికి చెందిన అనిత అనే మహిళ కడుపులో కణితి గడ్డ ఉండి తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతోంది. ఇటీవలే స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ దృష్టికి తీసుకువచ్చింది. గురువారం కడుపు నొప్పితో బాధపడుతున్న ఆమె సమస్యను ఎమ్మెల్యేకు వివరించింది. నియోజకవర్గ పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే సదరు మహిళను అచ్చంపేట సివిల్ ఆసుపత్రికి గురువారం సాయంత్రం పిలిపించి, ఆసుపత్రి వైద్యులతో కలిసి ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు.

మత సామరస్యానికి రంజాన్ ప్రతీక



ఇఫ్తార్ విందులో పాల్గొన్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు బృంగి ఆనంద్‌కుమార్

కల్వకుర్తి, ఏప్రిల్ 4 : మత సామరస్యానికి రంజాన్ ప్రతీకగా నిలుస్తుందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ అన్నారు. కల్వకుర్తి పట్టణంలో బస్టాండ్ సమీపంలో ఉన్న మసీద్‌లో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన హాజరయ్యారు. అనంతరం ముస్లింలతో కలిసి ప్రార్థనలు నిర్వహించారు. కల్వకుర్తిలో ముస్లిం మైనార్టీల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో కృషి చేస్తానని ఆయన తెలిపారు.

రియల్ దందాలో మోసాలు

- అక్రమ వెంచర్లలో రాళ్లను తొలగించిన అధికారులు

- మళ్లీ పాతుకున్న రియల్ వ్యాపారులు

- అయోమయంలో ప్లాట్ల కొనుగోలుదారులు



అక్రమ లేఅవుట్ల రాళ్లను తొలగిస్తున్న మునిసిపల్ సిబ్బంది

కల్వకుర్తి, ఏప్రిల్ 4 : అనుమతి లేని అక్రమ వెంచర్లలో మునిసిపల్ అధికారులు రాళ్లను తొలగించారు. అయితేనేం మాకు ఎవరు అడ్డు అన్నట్లుగా రియల్ వెంచర్ యజమానులు యథావిధిగా మళ్లీ రాళ్లుపాతడం పలు అనుమానాలకు తావిస్తోంది. అక్రమ వెంచర్‌లోని రాళ్లను మళ్లీ అధికారులు తొలగించారు. దీంతో ప్లాట్ల కొనుగోలుదారులకు అర్థంకాని పరిస్థితి నెలకొంది. హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న కల్వకుర్తిలో రియల్ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుంది.

● కల్వకుర్తి మునిసిపాలిటీలో...

కల్వకుర్తి పట్టణంలో కుర్మిద్ద రోడ్డులో ఈద్గా వెనక భాగంలో ఉన్న సర్వే నెంబరు 736/2ఏ, 736/4లో ఆరు ఎకరాలకు గతంలో గ్రామపంచాయతీ నుంచి అనుమతి పొందారు. హైకోర్టు ఆర్డర్‌తో 2018 తర్వాత రిజిస్ట్రేషన్లు చేయించుకున్నట్లు సమాచారం. డీటీసీపీ నిబంధనల ప్రకారం ఎల్ఆర్ఎస్‌లో రెగ్యులరైజ్ చేసుకోకపోవడంతో మునిసిపల్ అధికారులు ఆ వెంచర్‌లోని రాళ్లను తొలగించారు.

తమకు అడ్డు ఎవరన్న అహంతో కూలీలతో మళ్లీ రాళ్లను పాతించారు. తీరా మరోసారి మునిసిపల్ అధికారులు వెంచర్‌లోని రాళ్లను తొలగించారు. ఇదిలా ఉండగా కల్వకుర్తి పట్టణంలోని సాయిబాలాజీ ఫంక్షన్ హాల్ సమీపంలో 746/ఈ/1లో నాలుగెకరాల్లో మరో అక్రమ వెంచర్‌ను సృష్టించి ప్లాట్లను విక్రయించారు. ఈ వెంచర్‌లోని రాళ్లను సైతం అధికారులు తొలగించారు.

నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ ప్లాట్ల కొనుగోలుదారులతో చెలగాటమాడుతున్న రియల్ వ్యాపారుల ఆగడాలకు అడ్డుకట్ట పడేనా అని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

● అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకుంటాం



నిబంధనలకు విరుద్ధంగా ఉన్న అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకుంటాం. అనధికారిక లేఅవుట్‌కు ఎల్ఆర్ఎస్ ఉండాల్సిందే. పట్టణంలోని 736/2ఏ, 736/4లోని వెంచర్‌లో రాళ్లను తొలగించాం. ఎల్ఆర్ఎస్ ఉంటేనే నిబంధనలు వర్తిస్తాయి.

- ఆశ్రిత్‌కుమార్, మునిసిపల్ కమిషనర్

ఎన్నికల నిర్వహణలో పోలింగ్ అధికారుల పాత్ర కీలకం

- కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి. ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల నిర్వహణలో పోలింగ్ అధికారుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ తెలిపారు. 18వ లోక్‌సభ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు నిర్వహణలో అవలంబించాల్సిన విధివిధానాలు, పోస్టల్ బ్యాలెట్ వినియోగం తదితర అంశాలపై కలెక్టర్ గురువారం దిశానిర్దేశం చేశారు. నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు పోలింగ్ విధులు, బాధ్యతలపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ అధికారులకు ముఖ్యంగా ఈవీఎం యంత్రాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, మాక్ పోల్ నిర్వహణ, ఈవీఎం యంత్రాల పనితీరు, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్ల కనెక్షన్లు, వాటి పనితీరు, మరమ్మతులు జరిగితే తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. తొలివిడత శిక్షణ ఇప్పటికే జరిగిందని, ఎన్నిక నిర్వహణ విధానంలో భాగంగా బ్యాలెట్, కంట్రోలింగ్ యూనిట్, వీవీప్యాట్‌ల అమరిక తదితర అంశాల గురించి అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ అనంతరం సమర్పించే స్టాట్యూటరీ, నాన్‌స్టాట్యూటరీ కవర్స్, పీవో డైరీ, 17ఏ, 17సీ ఫార్మ్‌లపై తలెత్తే సందేహాలను నివృత్తి చేశారు. పోలింగ్ ప్రక్రియ నిర్వహణపై పీవోలు, ఏపీవోలు అవగాహన కోసం హ్యాండ్‌బుక్ అందజేస్తున్నామని, క్షుణ్ణంగా ప్రతీ అంశాన్ని చదవాలని పేర్కొన్నారు. అనంతరం ఎన్నికల సిబ్బంది గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎదుర్కొన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో అలాంటి సమస్యలు రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, ట్రైనింగ్ అండ్ మేనేజ్‌మెంట్ నోడల్ ఆఫీసర్ గోపాల్, జిల్లా ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల్‌నర్సింహ

చారకొండ, ఏప్రిల్ 4: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మోదీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల్‌నర్సింహ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం గత 10 ఏళ్లుగా అధికారంలో ఉండి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలం వెళ్లదీస్తున్నారని అన్నారు. అయోధ్య రామాలయం, దేశభక్తి, హిందుమతానికి అన్యాయం జరిగిందనే పేరుతో పార్లమెంట్ ఎన్నికలకు వస్తున్నారని అన్నారు. బీజేపీ ప్రభుత్వం మణిపూర్ ప్రజలపై జరిగిన దాడులు, దళిత, గిరిజనులపై దాడులు చేసినందుకు బీజేపీ ప్రభుత్వానికి ఓటు వేయాలని ప్రశ్నించారు. మౌలిక సౌకర్యాలు, ఇతర ఉపాధి అవకాశాలు కల్పించడంలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందన్నారు. దేశంలో ఎన్డీఏ కూటమిని దించేందుకు దేశ ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. మోదీ తన రాజకీయ లబ్ధికోసం సీబీఐ, ఈడీ, ఐటీలను ఉపయోగించి అక్రమ కేసులు బనాయించి పార్టీలను నిర్వీర్యం చేయాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పార్టీల ఫిరాయింపులను ప్రోత్సహించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని అన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 25 వేలు పరిహారం చెల్లించాలని, రైతు బంధు, రుణమాఫీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేయాలని అన్నారు. సీపీఐ జిల్లా సమితి సభ్యుడు డాక్టర్ చిలివేరు శ్రీనివాసులు, డాక్టర్ సీహెచ్ సత్యం, సీపీఐ మండల కార్యదర్శి ఏసారపు ఆశోక్‌గౌడ్, ఏఐవైఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కేశమల్ల శివకృష్ణ, ఏఐవైఫ్ మాజీ జిల్లా నాయకుడు జగన్, పుట్ట కుర్మయ్య, మద్దినారయణరెడ్డి, జెల్ల బాలయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- డీఆర్‌డీఏ డీపీఎం అరుణాదేవి



శ్రీపురంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఆర్‌డీఏ డీపీఎం అరుణాదేవి

కందనూలు, ఏప్రిల్ 4 : నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని శ్రీపురం గ్రామంలో ఐకేపీ, గ్రామ సమైక్య మహిళా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని డీఆర్‌డీఏ డీపీఎం అరుణాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా వరి కొనుగోలు కేంద్రాన్ని గ్రామపరిధిలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కొనుగోలు కేంద్రానికి వచ్చే రైతులు ధాన్యంలో తేమ శాతం తక్కువగా ఉండేలా, తాలు లేకుండా చూసుకోవాలన్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 104 కొనుగోలు కేంద్రాలకుగాను గురువారం 40 కేంద్రాలను ప్రారంభించి ప్రారంభించినట్లు తెలిపారు. ఏపీఎం ప్రభాకర్, సీసీలు కమిటీ మెంబర్లు, గ్రామ ప్రజలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు మోసపోవద్దు

కొల్లాపూర్ : రబీ సీజన్ వరి కొనుగోలు కేంద్రాలను గ్రామ ఐక్య సంఘం ఆధ్వర్యంలో మండలంలోని 11 సెంటర్లల్లో ప్రారంభిస్తున్నామని గురువారం ఎల్లూరు గ్రామంలో ప్రారంభించినట్లు ఏపీఎం సరాయి తిరుపతయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో వరి పండించిన రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని గ్రామాల్లో ప్రారంభించిన కొనుగోలు కేంద్రాల్లో ఏగ్రేడ్ క్వింటాల్ వరికి 2203రూపాయలు చెల్లిస్తున్నామని, బిగ్రేడ్‌కు 2183రూపాయలు చెల్లిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రైతులు దళారులను ఆశ్రయించి తక్కువ ధరకు తమ పంటను విక్రయించి నష్టపోకూడదని ఆయన పేర్కొన్నారు. ఎల్లూరు గ్రామంలో ప్రారంభించిన ఐక్య సంఘం సభ్యులు సుజాత, గౌరమ్మ, నాగేశ్వరమ్మ, రాధమ్మ పాల్గొన్నారు.

● వెల్దండ : పీఏసీఎస్ కార్యాలయంలో గురువారం వరి కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయాధికారిణి మంజుల ప్రారంభించారు. ప్రభుత్వం ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పిస్తుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రైవేటు మార్కెట్‌లో దళారులకు ధాన్యాన్ని అమ్మి మోసపోవద్దని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాసులు, వెంకటొరెడ్డి తదితరులు ఉన్నారు.

● పెద్దకొత్తపల్లి : రైతులు పండించిన వరిని దళారు లకు తక్కువ ధరలకు విక్రయించి మోసపోవద్దని పెద్ద కొత్తపల్లి సింగిల్ విండో సీఈవో సిరాజుద్దీన్ అన్నారు. మండల పరిధిలోని దేవునితిర్మలాపూర్ గ్రామంలో పెద్దకొత్తపల్లి సింగిల్ విండో ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు రబీ సీజన్‌లో పండించిన వరిని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని కోరారు.

● కోడేరు: యాసంగి వరి కొనుగోలు కేంద్రాలను సింగిల్ విండో ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు. వరి కొనుగోలు కేంద్రాలు మండల పరిధిలోని నర్సాయిపల్లి, మైలారం తదితర గ్రామాల్లో ప్రారంభించామని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సీఈవో నర్సరాజు తెలిపారు. మాజీ సర్పంచ్‌లు ఆంజనేయులు, కాంగ్రెస్ నాయకులు కొండల్‌రావు, కుమ్మరి బాలస్వామి, బి.బీరయ్య, గుండు అర్జునయ్య, ఆర్.ఆంజనేయులు, తాళ్ల వేణుగోపాల్, రైతులు ఖాజా, మల్లేష్, అగ్రస్వామి తదితరులు పాల్గొన్నారు.

● ఊర్కొండ: మండల కేంద్రంతో పాటు రేవల్లి, బొమ్మరాజుపల్లి తదితర గ్రామాల్లో గురువారం వరి కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ సిబ్బంది ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. పీఏసీఎస్ సిబ్బంది అభిషేక్, రైతులు ఫరీద్, అయూబ్‌పాష, సంగప్పగౌడ్ తదితరులు ఉన్నారు.

● పెంట్లవెల్లి: మండల పరిధిలోని జటప్రోల్, గోప్లాపూర్ గ్రామాల్లో గురువారం సీసీ శోభారాణి వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోకూడదనుద్దేశంతో మద్దతు ధర ప్రకటించిందని వారు పేర్కొన్నారు. ఏ గ్రేడ్ రకానికి క్వింటాల్‌కు 2203రూపాయలు, సాధారణ రకానికి 2183రూపాయలు ప్రకటించిందని వారు తెలిపారు. రైతులు కుర్మయ్య, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వ్యవసాయ చట్టాలపై అవగాహన

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 4 : రైతులు వ్యవసాయ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పారా లీగల్ వలంటీర్ ఆకారం నాగరాజు అన్నారు. గురువారం మండల పరిధిలోని పెద్దకార్పాముల రైతు వేదికలో రైతులకు అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎరువుల దుకాణాల్లో ఎరువులు తీసుకునేటప్పుడు తప్పనిసరిగా రసీదులు పొందాలన్నారు. లైసెన్సులు లేని ఎరువుల దుకాణాల్లో కొనరాదన్నారు. అదేవిధంగా ఈకేవైసీ గురించి రైతులకు అవగాహన కల్పించారు.

'చెరువు మట్టిని తరలించి క్యాష్ చేసుకుంటున్న అక్రమార్కులు'

తెలకపల్లి, ఏప్రిల్ 4 : మండల కేంద్రంలోని కార్వాన్ గ్రామ పంచాయతీ పరిధిలోని నందిపేటలోని గుండ్రేటికుంట చెరువులోని మట్టిని అక్రమంగా తరలిస్తూ క్యాష్ చేసుకుంటున్న కొంతమంది యాజమాన్యాలు, జేసీబీ ఓనర్లు దీనికి గ్రామంలోని అధికార పార్టీకి చెందిన పెద్దమనుషులు దీన్ని అరికట్టాలని సీపీఎం మండల కార్యదర్శి నందిపేట బాస్కర్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ పరిధిలోని భూములు, చెరువులు, కుంటలకు సంబంధించి సిల్ట్ మట్టిని టెండర్ ద్వారా తరలించి గ్రామాభివృద్ధికి పాటుపడాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు కొంతమంది యాజమాన్యానికి అక్రమ సంపాదన సంపాదించుకోవడం కోసం వారికి సహకరిస్తున్నట్లు ఆరోపించారు. గ్రామపంచాయతీకి సంబంధించిన నిధులను కొల్లగొడుతూ వారికి మద్దతుగా నిలుస్తూ నిబంధనలు పాటించకుండా అక్రమార్జనతో సంపాదన కోసం గ్రామ ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని దీన్ని నియంత్రించాల్సినవసరం ఎంతైనా ఉందన్నారు. లేకుంటే ప్రజలతో కార్యాలయాలను ముట్టడిస్తామని సీపీఎం మండల కార్యదర్శి నందిపేట బాస్కర్ హెచ్చరించారు.

'కాంగ్రెస్‌తోనే అభివృద్ధి'

కల్వకుర్తి, ఏప్రిల్ 4 : కాంగ్రెస్‌తోనే తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి, అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తుందని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుపరుస్తూ ప్రజల విశ్వాసాన్ని పొందిందన్నారు.

నేడు బీఆర్ఎస్ సన్నాహక సమావేశం

అచ్చంపేట, ఏప్రిల్ 4: అచ్చంపేట పట్టణంలోని బీకే ఫంక్షన్‌హాల్లో శుక్రవారం ఉదయం 10 గంటలకు అచ్చంపేట నియోజకవర్గం బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అచ్చంపేట నియోజకవర్గ స్థాయి పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రేపు కొల్లాపూర్‌లో..

కొల్లాపూర్, ఏప్రిల్ 4 : ఈ నెల 6వ తేదీన కొల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంచందర్‌యాదవ్, మాజీ జడ్పీటీసీ కాటం జంబులయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుండ్రెడ్డి నరేందర్‌రెడ్డిలు పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీన ఉదయం 10గంటలకు కొల్లాపూర్ పట్టణంలోని ఎస్ఎం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే ఎంపీ ఎన్నికల సన్నాహక సమావేశానికి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్‌ప్రవీణ్‌కుమార్ హాజరవుతారని ఈ సమావేశంలో ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ భారీ మెజార్టీతో గెలుపొందేందుకు ప్రణాళిక రూపొందించనున్నట్లు వారు పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఉన్న నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలన్నారు. బీఆర్ఎస్ నాయకులు కారంగి బ్రహ్మయ్య, కల్మూరి నిరంజన్, ఎంపీటీసీ శంకర్‌నాయక్, కట్ట శ్రీనివాసులు, భాస్కర్‌గౌడ్, శ్రీనివాసులు, హరికృష్ణ, బాలరాజు, భీమిని శేషయ్య, శ్రీనివాసులు, మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'సభను జయప్రదం చేయాలి'

ఉప్పునుంతల, ఏప్రిల్ 4: తుక్కుగూడలో ఈ నెల 6 వ తేదీన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కాంగ్రెస్ జనజాతరను విజయవంతం చేయాలని రాష్ట్ర నాయకుడు మోపతయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జనజాతర సభకు అచ్చంపేట నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ఉపాధిని సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో ఇసాక్‌హుసేన్

చారకొండ, ఏప్రిల్ 4: గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఇసాక్‌హుసేన్ అన్నారు. గురువారం మండల పరిధిలోని మర్రిపల్లిలో ఉపాధి హామీ పనులు, మస్టరును ఎంపీడీవో పరిశీలించి కూలీలతో మాట్లాడారు. వేసవికాలం కావడంతో కూలీలు ఉదయమే పనులకు వెళ్లి ఎండలు ముదరకముందే ఇంటికి తిరిగి వెళ్లాలని సూచించారు. నర్సరీ మొక్కలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. ఎండలకు మొక్కలు ఎండిపోకుండా షేడ్ నెట్‌లను ఏర్పాటు చేసి మొక్కలను రక్షించాలని అన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

● వంగూరు: పని ప్రదేశంలో ఉపాధి కూలీలకు కనీస వసతులు కల్పించాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాలస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని సర్వారెడ్డిపల్లిలో ఉపాధి హామీ పథకంలో కూలీలు చేస్తున్న పని ప్రదేశాన్ని పరిశీలించారు. కూలీలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పని ప్రదేశంలో కూలీలు ఎండకు సేద తీర్చుకోవడానికి టెంట్, ఓఆర్ఎస్ ప్యాకెట్స్, మెడికల్ కిట్స్ అందుబాటులో లేవని, దీంతో కూలీలు ఎంతో ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వాటిని అందుబాటులో ఉంచేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. చేసిన పనులకు సకాలంలో బిల్లులు రావడం లేదని, పెండింగ్ బిల్లులను వెంటనే ఇవ్వాలన్నారు. వెంకటయ్య లింగమయ్య, యాదమ్మ పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ డబ్బులు చెల్లించాలి

ఉప్పునుంతల, ఏప్రిల్ 4: ఉపాధిహామీ పథకంలోని కూలీలకు పెండింగ్‌లో ఉన్న డబ్బులు వెంటనే చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి నాగరాజ్ గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూలీలు పనిచేసే ప్రదేశంలో టెంటు, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్, మెడికల్ కిట్ కల్పించాలని పేర్కొన్నారు. గత రెండు మూడు నెలల నుంచి కూలీలకు డబ్బులు ఇవ్వడం లేదని తక్షణమే అధికారులు స్పందించి వెంటనే చెల్లించాలని ఆయన కోరారు.

ఘనంగా వన మహోత్సవం

వెల్దండ, ఏప్రిల్ 4 : మండలకేంద్రంలో గురువారం వన మహోత్సవం కార్యక్రమం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తమ గ్రామానికి ఎటువంటి కీడు కలుగవద్దని గ్రామదేవతలైన పోచమ్మ, మైసమ్మ, ఎల్లమ్మలకు కోళ్లు, మేకలు కోసి నైవేద్యం సమర్పించారు. అనంతరం తమ వ్యవసాయ పొలాల వద్ద వంటావార్పులు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు.

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ



అలివేలమ్మ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 4 : మండల పరిధిలోని దేవునితిర్మలాపూర్ గ్రామానికి చెందిన మృతురాలు కే అలివేలమ్మ ఇటీవల మృతి చెందింది. గురువారం దశదినకర్మ సందర్భంగా ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్‌లు వి.సత్యం, పి.చిన్నయ్య, మాజీ ఉప సర్పంచ్ వి.శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యులు దేవరపాగ రవికుమార్, కొత్తప్రతాప్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ జి.బాలస్వామిరైతు సమన్వయ సమితి మాజీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు, పర్వతాలు, బాలింగాచారి, మృతురాలి కుటుంబ సభ్యులు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, కొత్త వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

'పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం'

ఊర్కొండ, ఏప్రిల్ 4: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని బీజేపీ ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు మహేందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఎస్సీ మోర్చా నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి ప్రభుత్వం ఏర్పాటు అయ్యేవిధంగా కృషి చేద్దామని, నాయకులంతా సమష్టిగా పోరాడుదామని తెలిపారు. నర్సంపల్లి మాజీ సర్పంచ్ నిరంజన్‌గౌడ్, నాయకులు సాయిబాబా, లక్ష్మణ్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

రూ. రెండు లక్షల రుణమాఫీ చేయాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకులు

వంగూరు ఏప్రిల్ 4: రైతులకు తక్షణమే రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు శివరాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్టంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే డిసెంబర్ 9న రూ.2 లక్షల రుణమాఫీ ఒకేసారి చేస్తామని శాసనసభ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టారు... మీ మాటను నమ్మి రాష్టంలో లక్షలాది మంది రైతులు బ్యాంకుల నుంచి పంట రుణాలు తీసుకున్నారు... కానీ మీరు అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అవుతున్నా ఇప్పటికీ ఒక్క రైతుకు కూడా రుణ మాఫీ కాలేదన్నారు. బ్యాంక్ అధికారులు రైతులను ఒత్తిడి చేస్తున్నారని వెంటనే ప్రభుత్వం రుణమాఫీ నిధులను విడుదల చేయాలని పేర్కొన్నారు.

వాహనదారులు ఎన్నికల నియమావళిని పాటించాలి



వాహనాలను తనిఖీ చేస్తున్న చిన్నహుసేన్‌యాదవ్

చారకొండ, ఏప్రిల్ 4: వాహనదారులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని ఫ్లయింగ్‌స్క్వాడ్ చిన్నహుసేన్‌యాదవ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా గురువారం మండల కేంద్రంలో ఆయన వాహనాలను తనిఖీ చేశారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.